www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి



మంచు సోయగం..

ప్రజాశక్తి - పెనుమంట్ర

గురువారం తెల్లవారుజామున మంచు పరదా కప్పేసింది. ముఖ్యంగా ప్రధాన కూడలి అయిన మార్టేరు సెంటర్‌లో తెల్లవారుజామున కమ్మేసిన పొంగ మంచు వల్ల రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఉదయం 10 గంటల వరకూ మంచు తీవ్రత తగ్గలేదు. దీంతో వాహనాలపై వెళ్లే వారు మాస్కులు ధరించి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రహదారిపై కమ్ముకున్న మంచు

కోడి జోడి



పెద్దఎత్తున కోడి పందేలకు రంగం సిద్ధం
కార్లు, బైక్‌ల పేరిట భారీ ఆఫర్లు
బరులు చదును చేస్తున్న పందెంరాయుళ్లు
పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

కాళ్ల మండలం సీసలిలో పందాలకు సిద్ధంచేసిన బరి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంకంటే భిన్నంగా కోడిపందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. బరులను చదును చేసే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కోడిపందేలను అడ్డుకుంటామంటూ పోలీసుల హెచ్చరికలు ఏటా మాదిరిగానే ఈసారీ కొనసాగుతున్నా పందెంరాయుళ్లు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. కోర్టుకు చెప్పుకునేందుకే బైండోవర్ కేసులు, పలుచోట్ల బరుల ధ్వంసం ఫొటోలు వంటివి పోలీసులు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. భోగి రోజు ఉదయం నుంచి పందేలు ప్రారంభం కానున్నట్లు పందెంరాయుళ్లు ధీమాగా చెబుతున్నారు. ఈసారి జోడి పందేల నిర్వహణ పేరుతో భారీ పందేలకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఎక్కువ పందేలు గెలిచిన వారికి బహుమతిగా కారు, బైక్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో భీమవరం సమీపంలోని పెన్నాడలో జోడి పందేలు గెలిచిన వారికి బైక్ ఇచ్చినట్లు పెద్దఎత్తున చెప్పుకున్నారు. ఈసారి ఆకివీడు, కాళ్ల,, కైకలూరు మండలాలతోపాటు పలుచోట్ల బహుమతుల కింద కార్లు, బైక్‌లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. జోడిపందేల కింద ఐదు పందేలు నిర్వహిస్తే మూడు పందేలు గెలిచిన వారికి ఈ బహుమతులు ఇస్తారు. ఒకవేళ మూడు పందేలు నిర్వహిస్తే రెండు పందేలు గెలిచిన వారికి బహుమతులు అందజేస్తారు. బహుమతిగా కారు పెట్టినచోట తొమ్మిది పందేలు నిర్వహించి ఐదు పందేలు గెలిచిన వారికి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. పందెంరాయుళ్లను ఆకర్షించేందుకు జోడి పందేలపై విపరీతమైన ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో జోడి పందేల్లో బెట్టింగ్ కింద ప్రతి పందేనికి రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ కొనసాగనున్నట్లు చెబుతున్నారు. జోడి పందేల్లో పాల్గొనే వారు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన పుంజులను పందేల్లో దింపేందుకు సిద్ధమవుతున్నారు. దెందులూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెం, ఏలూరు వంటి పలుచోట్ల సైతం పెద్దఎత్తున పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పందేల ఏర్పాట్లు స్థానిక ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పందేలు నిర్వహించాలి.. ఎవరికింత మామూళ్లు ఇవ్వాలో సైతం ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్నట్లు చెబుతున్నారు. పందేలను అంతా తిలకించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిడమర్రు మండలం మందలపర్రులో భారీ పందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇదే గ్రామంలో ప్రధాన రహదారికి పక్కగా పెద్దఎత్తున పందేలు నిర్వహించినా అడ్డుకున్న నాథుడే లేడు. గడిచిన రెండేళ్లుగా కోవిడ్ నేపథ్యంలో పందేల్లో పాల్గొనేందుకు కొంత జంకేవారు. ఈసారి అటువంటి పరిస్థితి లేకపోవడంతో జనాన్ని పెద్దఎత్తున పందేలకు ఆకర్షితులను చేసేందుకు బరుల నిర్వాహకులు బహుమతుల పేరుతో వల వేస్తున్నట్లు తెలుస్తోంది.

మూడు రోజులు మౌనమేనా..?

కోడిపందేలను అడ్డుకుంటామని పోలీసు, రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలన్నీ భోగిరోజు ఉదయం వరకేనని పందెంరాయుళ్లు ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. భోగి రోజు నుంచి మూడు రోజులపాటు పోలీసులు మౌనం వహించాల్సిందేనని అంటున్నారు. ప్రతియేటా ఇదే తంతు జరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లో తయారవుతున్న బరుల జోలికి పోలీసులు వెళ్లడం లేదని, చోటమోటా బరులను మాత్రమే ధ్వంసం చేస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఏం చేసినా భోగిరోజు వరకేనని, తర్వాత వారంతా ప్రేక్షక పాత్రకు పరిమితం కావాల్సిందేనని పందెంరాయుళ్లు ధీమాగా ఉన్నారు. గుండాట, మూడు ముక్కలాట వంటి జూద క్రీడలకు సైతం బరుల వద్ద అనుమతించే పరిస్థితి నెలకొంది. అదే జరిగితే పందేలు చూసేందుకు వచ్చే సామాన్య ప్రజానీకం సైతం జేబులు గుల్లచేసుకునే పరిస్థితి ఏర్పడనుంది.

కాళ్ల: పందెం కోడి కాలు దువ్వుతోంది. లక్షలు చేతులు మార్చుకోవడానికి పందెంరాయుళ్లు సన్నద్ధమయ్యారు. మండలంలో పలు గ్రామాల్లో భారీస్థాయిలో కోడిపందేలకు రంగం సిద్ధమైంది. సీసలిలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పొలంలో కోడి పందేల బరిని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మండలంలో జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, జక్కరం, పెదఅమిరం, సీసలి గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కోడిపందేల బరులను సిద్ధం చేస్తున్నారు.

సీసలిలో ఫ్లడ్ లైట్లు సైతం ఏర్పాటు

సీసలిలో పదెకరాల పొలంలో బరిని సిద్ధం చేసి పెద్ద పందేలు వేసే చోట భారీ క్లాత్ టెంట్ ఏర్పాటు చేశారు. బరి చుట్టూ అల్యూమినియం మెస్ ఏర్పాటు చేశారు. బరిలోకి వచ్చి వెళ్లేందుకు రెండు మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయాల్లోనూ పందేలు కొనసాగించేందుకు ఫ్లడ్‌లైట్లు, గ్యాలరీలు సైతం ఏర్పాటు చేస్తుండటం విశేషం.

పెనుమంట్ర: కోడి పందేల నిర్వహణకు బరులు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ముఖ్యంగా నత్తారామేశ్వరం, గరువు, ఆలమూరు, మార్టేరు పరిధిలో పందేల నిర్వహణకు ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతలు, పెద్దల అండదండలతో బరుల ఏర్పాట్లు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. ఈ బరుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే కొన్ని చోట్ల వేలం పాట కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం.


కోడి పందేలను అరికట్టాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, జూదం, పేకాట వంటి వాటిని అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో కోడిపందేలు, జూదం, పేకాట, మత్తు పదార్థాలు, గంజాయి వంటివి ప్రజల జీవితాలను అస్తవ్యస్థం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ వ్యసనాలు యువతీ యువకులను, విద్యార్థులను లొంగదీసుకుంటున్నాయని తెలిపారు. ఈ చట్ట వ్యతిరేక చర్యల పట్ల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు. ఈ వ్యసనాల నుంచి వారి దృష్టి మరల్చేందుకు గ్రామాలు, పట్టణాల్లో ఆటల పోటీలు నిర్వహించి, యువతీ యువకులను, క్రీడాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ అనేది వ్యసనాలకు అవకాశం ఇచ్చేదిగా కాకుండా ఆహ్లాదంగా, ఆనందంగా జరుపుకోవాలని, అయితే కోడిపందేలు, జూదం, పేకాట వంటివి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ఇటువంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం, అధికార, పోలీసు యంత్రాంగాలు కట్టుదిట్టమైన చర్యల ద్వారా కట్టడి చేయాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో చాలామంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకొస్తారని పేర్కొన్నారు. అనేక సంస్థలు, సంఘాలు సంక్రాంతి సందర్భంగా ఆటల్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్వహించాలని కోరారు. పోలీసు యంత్రాంగం పండుగకు ముందు వరకు కోడిపందేలు, జూదం, పేకాట వంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నా, రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక అనుమతులతో కిమ్మనకుండా ఉంటున్నారని ఆయన విమర్శించారు. సాక్షాత్తూ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు గత సంవత్సరం దగ్గరుండి కోడిపందేలు నిర్వహించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వీటిలో పాల్గొనే ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టులు సుమోటోగా ఇటువంటి వాటిని స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పండుగలను ఆహ్లాదకరంగా, ఆనందంగా జరుపుకోవాలని, క్రీడలను ప్రోత్సహించాలని, చట్టవ్యతిరేకమైన వాటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని బలరాం కోరారు.

అఖిలపక్షం ఆధ్వర్యాన
జిఒ1 ప్రతుల దహనం

ప్రజాశక్తి - పెంటపాడు



పెంటపాడులో..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ జిఒ రద్దు కోరుతూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రామప్రసాద్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, టిడిపి మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పోలీస్ పాలన సాగుతుందన్నారు. పౌర హక్కులను హరించే జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు, ఎపి రైతుసంఘం మండలాధ్యక్షులు కరకా వెంకట్రావు, యువజన సంఘం నాయకులు బర్ల బాలాజీ, పెనగంటి దుర్గ, గొర్ల ధనరాజ్, కొయ్యాల చంటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిఒ కాపీలను పెంటపాడు గాంధీబొమ్మ సెంటర్ వద్ద దహనం చేశారు.

తాడేపల్లిగూడెం: ప్రజా ఉద్యమాలను, ప్రదర్శనలను, సభలను నియంత్రించే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన అప్రజాస్వామిక జిఒ నెం.1ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద నిరసన తెలిపి జిఒ నెం.1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సోమసుందర్‌తోపాటు ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడగా నేతలు తాడికొండ శ్రీనివాసరావు, కొడమంచిలి చంద్రరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, బి.రామ్మోహన్, ఆర్.గంగాధరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: జిఒ నెం.1 ప్రతులు, సైకో ప్రభుత్వ దిష్టిబొమ్మలను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఇన్‌ఛార్జిలు, మండల, పట్టణాలు, గ్రామాల్లో అన్ని కమిటీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



తాడేపల్లిగూడెంలో..

ధాన్యం కొనుగోళ్లు ఆపేయడంపై కౌలురైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట



నినదిస్తున్న కౌలురైతులు

ప్రభుత్వ టార్గెట్ అయిపోయిందని, బ్యాంకు గ్యారెంటీ లేదనే సాకుతో ధాన్యం కొనుగోలు చేయకుండా కౌలురైతులను తీవ్ర ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు విమర్శించారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఆచంటలోని 1, 2, 3 రైతుభరోసా కేంద్రాలు, పెనుమంచిలి, వేమవరం తదితర రైతుభరోసా కేంద్రాల్లో కూపన్లు ఇచ్చి 500 టన్నులు పైబడి ధాన్యం ట్రక్కులపై ఎగుమతి చేసి వారం రోజులవుతున్నా టార్గెట్ అయిపోయిందని, బ్యాంకు గారెంటీ లేదనే పేరుతో ట్రక్ షీట్లు జనరేట్ చేయలేదన్నారు. దీంతో ఆ వాహనాల యజమానులు రైతులపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. ధాన్యం అమ్మిన కౌలు రైతులు వారం రోజులుగా వ్యవసాయాధికారులు, సివిల్ సప్లయిస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం ఎప్పటికి తీసుకుంటుందో చెప్పలేం, తామేమీ చేయలేమని సమాధానం చెప్పడం దారుణమన్నారు. అనంతరం ఆర్ఐ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో కౌలు రైతులు శీలం సత్యనారాయణ, చిలుకూరి శ్రీనివాస్, బాలం దశరథరామిరెడ్డి, చిలుకూరి వెంకటరమణరావు, బాదరాల యల్లారావు, నాగబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువత డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు అండగా నిలవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బేతపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భువన విజయం దర్బార్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తూనే మరోపక్క సాఫ్ట్‌వేర్ వైపు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అయితే సాఫ్ట్‌వేర్ రంగాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు హైదరాబాద్ వంటి నగరాల్లో కోచింగ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, ఈ ప్రాంత విద్యార్థులు అంత దూరం వెళ్లి అనేక వ్యయ ప్రయాసలకు గురి కాకుండా దగ్గర్లోనే ఇటువంటి సెంటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసిన కొట్టి మహేంద్రనాథ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, కొమరాడ సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ ఎం.వెంకట సత్యనరసింహారావు, కె.కుటుంబరావు, ప్రహ్లాదుడు, నామన మహేష్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల రాజీపై ప్రత్యేక దృష్టి
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సోని

ప్రజాశక్తి - భీమవరం రూరల్



సమీక్షిస్తున్న జస్టిస్ డి.సోని

ఫిబ్రవరి 11న నిర్వహించే లోక్‌అదాలత్‌లో పెండింగులో ఉన్న క్రిమినల్ కేసుల రాజీపై ప్రత్యేక దృష్టి సారించాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సోని సూచించారు. గురువారం సాయంత్రం కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీ చేయదగిన అన్ని కేసులను గుర్తించి నోటీసులిచ్చి ఉభయ కక్షిదారులకు సమన్యాయం జరిగేలా పోలీసు అధికారులు తమవంతు కృషి చేయాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్ ముఖ్యోద్దేశం కక్షిదారులకు తెలిసేలా అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, గృహ హింస చట్టం, సివిల్ తగాదాలు తదితర కేసుల్లోనూ సమన్యాయం పొందడానికి లోక్‌అదాలత్‌లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం రూరల్ సిఐ ప్రసాద్, ఆకివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్ఐలు, లైజన్ ఆఫీసర్ రామతులసి పాల్గొన్నారు.

అండలూరులో డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం



సర్వేను పరిశీలిస్తున్న దాసి రాజు

జగనన్న భూసర్వే-శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా అండలూరులో డ్రోన్ సర్వేను భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ సుందర్రాజు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ భూములన్నింటీ సమగ్రంగా సర్వే చేసి రైతుల సమక్షంలో చేసిన సర్వేను పరిశీలించి, అందులో ఏమన్నా లోటుపాట్లు ఉంటే పరిశీలించి వారి సమక్షంలోనే భూరికార్డులను సరిచేసి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేయడమే దీని ప్రధానోద్దేశమన్నారు. ఈ సర్వేకు రైతులు, భూయజమానులు సహకరించాలని కోరారు. ఈ సర్వే వల్ల వందేళ్లకుపైబడి ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ లోపాలను, దాని వల్ల ఏర్పడ్డ సమస్యలను శాశ్వత పరిష్కారం చేసి జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా రికార్డులను నవీకరించి భూయజమానులకు అందజేస్తామని చెప్పారు. ఖర్చుతో కూడుకున్న పనైనా ప్రభుత్వం భూసమస్య పరిష్కారమే లక్ష్యంగా ఈ పని చేస్తుందన్నారు. దీన్ని భూయజమానులు సద్వినియోగం చేసుకుని భూవివాదాలకు శాశ్వత ముగింపు పలకాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి పాతగొలుసు భోగేశ్వరరావు, ఎంపిటిసి బొల్లెంపల్లి శ్రీనివాస్ చౌదరి, మండల సర్వేయర్ శైలజ, ఆర్ఐ రూజ్‌వెల్ట్, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం
సబ్‌కలెక్టర్ సూర్యతేజ




పాలకొల్లులో పోటీలు ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - పాలకొల్లు

యువత కోడి పందేలు, గుండాట, జూదం వంటి వ్యసనాలకు మరలకుండా వాలీబాల్ వంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ చెప్పారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల వాలీబాల్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. మన క్రీడాకారులు అంతర్జాతీయంగా ఎంతో ఖ్యాతి గడిస్తున్నారని, మన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు విదేశాల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సాధిస్తున్నారన్నారు. యువత క్రీడారంగంలో కూడా మంచి నైపుణ్యం సాధించాలని, గతంలో పాలకొల్లు క్రీడాకారులు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందారని చెప్పారు. ఎంఎల్‌ఎ రామానాయుడు తొమ్మిది సంవత్సరాలుగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు అనంతరం జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నేతలు కర్నేన రోజా రమణి, బోనం నాని, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా యనమదుర్రులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ యువతను ప్రోత్సహిస్తూ ఇటువంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజును, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు పేరిచర్ల విజయ నరసింహారాజు, తిరుమాని ఏడుకొండలు మాట్లాడుతూ మూడు రోజులపాటు సాగే ఈ పోటీల్లో 12 టీములు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్, తహశీల్దార్ వై.రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్రప్రభు, నేతలు కామన నాగేశ్వరరావు, సర్పంచి బూరాబత్తుల రామ్మూర్తి, తిరుమల విజయరామ్, అల్లూరి కృష్ణంరాజు, తోట భోగయ్య, ఎఎస్.రాజు, గూడూరి ఓంకార్, కొల్లి ప్రసాద్, నాగరాజు శ్రీనివాసరాజు, తిరుమాని ధనుంజయ పాల్గొన్నారు.



భీమవరం రూరల్ మండలం యనమదుర్రులో పోటీలు ప్రారంభిస్తున్న గ్రంధి

పథకాల కోసమే అప్పులు
మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా అప్పులు తెచ్చి మరీ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని 24వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో రూ.3.74 లక్షల కోట్లు అప్పు చేసి దోచుకో.. దాచుకో అన్నట్టు చంద్రబాబు వ్యవహరించారని విమర్శించారు. జగన్ చంద్రబాబుకన్నా తక్కువ అప్పు తెచ్చి దేశంలో ఎక్కడా లేనంతగా సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 12 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చామని వివరించారు. అందుకే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని మంత్రి కారుమూరి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి సందర్భంగా వైసిపి నాయకులు కనుమూరు ఆనంద వర్మ ఆధ్వర్యంలో దుంపగడపలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పురుషులతో పాటు మహిళలకు కూడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 19 టీములు పురుషులు, 9 మహిళ టీములు పాల్గొన్నాయి. మొదటి రోజు గురువారం పురుషుల విభాగంలో కొణికివాడ టీమ్, దుంపగడప వి.వి.గిరి కళాశాల టీం, దొడ్డనపూడి టీము దుంపగడప బాయ్స్ టీం, అయిభీమవరం టీములు గెలుపొందాయి. రాత్రి పొద్దుపోయే వరకూ ఈ పోటీలు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, నిర్వాహకుడు కనుమూరి ఆనందవర్మ పాల్గొన్నారు.

కళ్యాణ మండపం ఏర్పాటు అభినందనీయం

వీరవాసరం :సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా దాతలు దేవస్థానంలో కళ్యాణ మండపాన్ని నిర్మించడం అభినందనీయమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వేణుగోపాలస్వామి, సీతారామస్వామి దేవస్థానం పరిధిలోని సీతారామస్వామి దేవాలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఎంఎల్ఎ గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మద్దాల ప్రభాకరరావు ప్రోత్సాహంతో దాత రాళ్లపల్లి సౌభాగ్యవతి రూ.నలబై లక్షలతో ఈ కళ్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా దేవస్థానంలో కళ్యాణ మండపం ఏర్పాటు గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దాత రాళ్లపల్లి సౌభాగ్యవతి, సర్పంచి చికిలే మంగతాయారు, దేవస్థానం ఛైర్మన్ కందుల సురేష్, పాలా నాగరాజు పాల్గొన్నారు.

నాటి జ్ఞాపకాలు మధురం

కాళ్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాళ్ల:39 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాళ్ల ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు వేగేశ్న సత్యనారాయణ రాజు, షేక్ మస్తా వలి, ముదుండి సత్యనారాయణ రాజు, పి.రామరాజు, వి.సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బదిరెడ్డి కృష్ణ, కొల్లి శ్రీనివాసు, సుంకర కాశీ విశ్వేశ్వరరావు, నిమ్మల శ్రీనివాసు, ఎన్.వెంకట్రామయ్యలతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

ఆచంట: మేలు జాతి పశువుల వీర్యం ఉపయోగించడం ద్వారా ఆవు దూడలను ఎక్కువ ఉత్పత్తి చేసి తద్వారా పాల దిగుబడి పెరుగుతుందని డివిఎల్‌డిఎ ఏసురత్నం అన్నారు. కోడమంచిలిలో పశువుల ఆసుపత్రి వద్ద పెయ్య దూడల ఉత్పత్తిపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచి ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడుతూ పశువుల పెంపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ జయకర్ జాన్సన్, డాక్టర్లు ఎల్.పణికుమార్, వెన్నపు సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా యల్లాప్రగడ జయంతి

భీమవరం రూరల్:ప్రపంచ మానవాళి ప్రధాత యల్లాప్రగడ సుబ్బారావు తెలుగు ప్రజలకు గర్వకారణమని భీమవరం ఏరియా హాస్పిటల్స్ సూపరింటెండెంట్ ఎం.వీరాస్వామి అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యల్లాప్రగడ పార్క్, ఏరియా హాస్పిటల్ వద్ద ఆయన విగ్రహాలకు పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.జాన్‌బాబు, గోపాలశర్మ, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎన్.భాస్కరరావు, సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వివేకానంద స్వామిని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని మూడో వార్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నర్సింహరాజు, ఎంపిసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సత్యనారాయణ రాజు, భోగాయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సుబ్బారావు పేట ఏడో వార్డు వివేకానంద విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవా సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్‌కెఆర్‌.వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పేరిచర్ల మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : జెవిఎస్‌వికెవిఎం మున్సిపల్ పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి నాయకులు మహమ్మద్ ముజీబ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కెల్లా పెద్దిరాజు, కడలి రామలక్ష్మి, హెచ్ఎం రాయపాటి భవానీప్రసాద్ పాల్గొన్నారు. అలాగే వివేకానంద సందేశాన్ని ఆదర్శంగా తీసుకుని వాకర్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. క్లబ్ తరపున పెదగోపాలం గోశాలలో పనిచేస్తూ గుండె జబ్బుతో బాధపడుతున్న కుంపట్ల శ్రీనివాస్‌కు రూ.10 వేల విలువైన మందులు అందజేశారు. 20 మంది హెచ్ఐవి పిల్లలకు రూ.8 వేల విలువైన పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

నరసాపురం :వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో 25వ వార్డు వివర్స్ కాలనీలో వివేకానంద జయంతిని నిర్వహించారు. బాల సూరిబాబు వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వివర్స్ యునైటెడ్ ఫ్రంట్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఒగ్గు సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త నాగశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి సత్యనారాయణ, ప్రసాద్, చండీ రావు పాల్గొన్నారు.

పాలకొల్లు : మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కళాశాలలో వివేకానందుని జయంతి సందర్భంగా యూత్ ఫెస్ట్ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు వివేకానంద స్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రముఖ రచయిత రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత వాడరేవు సుందరరావు మాట్లాడుతూ యువత వివేకానందుని బోధనలను ఆచరించాలన్నారు. వివేకానంద స్వామి జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్ విద్యార్థులను తిలకించారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం షేక్ పీర్ సాహెబ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు గుంటూరు పెద్దిరాజు, నడపన గోవిందరాజు, భూపతిరాజు విశ్వనాథరాజు, పెచ్చెట్టి బాబు, పివివి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

శృంగవృక్షంలో ఆత్మీయ సమ్మేళనం

పాలకోడేరు:వాళ్లంతా ఆనాటి విద్యార్థులు. కలిసి చదివిన పాఠశాలలోనే ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే చోట కలిశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూనే తీపి గురుతులను నెమరు వేసుకున్నారు. ఈ మధురమైన ఘటనకు శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఈ పాఠశాలలో 1993-1994 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. 29 ఏళ్ల తర్వాత ఆనాటి విద్యార్థులంతా ఒకేచోట కలవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా గడిపారు. అనంతరం నాడు చదువు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు అల్లం వీర వెంకట సత్యనారాయణ, (కొండబాబు), కాటం శ్రీను, గునుపూడి బాలాజీ, ఎం.గణపతి, రెలంగి శ్రీనివాస్, గోపే సునీల్, శివవి ఏసు రాజు, పట్లం కిషోర్, చెన్నా నాగ చంద్రమోహన్, చిదగం విఘ్నేష్, బందెల మాణిక్యాలరావు, గెద్దాడ వేణు, మల్లూ లక్ష్మి నారాయణ, నాగ మణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పింఛనుదారులకు చీరలు, రగ్గులు అందజేత

కాళ్ల:దొడ్డనపూడిలో సంక్రాంతి సందర్భంగా పింఛను దారులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్ తెలిపారు. దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పింఛనుదారులకు చీరలు, రగ్గులు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు, కాటిం ట్రస్టు ద్వారా పింఛన్లు పొందుతున్న వారికి దుస్తులు అందించారు. మహిళలకు చీరలు, పురుషులకు రగ్గులు అందించారు. ఈ కార్యక్రమంలో కొల్లి.సురేష్, ఉప సర్పంచి నక్కా వీరకృష్ణ, పి.వసపయ్య పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలకు ఎకెపిఎస్ జూనియర్ కళాశాల ముస్తాబు

నేడు దుంపగడప కళాశాల స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఆకివీడు

దుంపగడప గ్రామం లోని ఆంధ్రకేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 13వ తేదీన అట్టహాసంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించడానికి కళాశాల అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. ఈ కళాశాల 1972లో ఏర్పడింది. ఎన్నో ఆశయాలతో, లక్ష్యసాధనలో భాగంగా మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు తన తండ్రి బాపిరాజు పేరుతో ఏర్పాటుచేసిన బాపిరాజు ధర్మ సంస్థ ద్వారా స్థాపించిన విద్యాసంస్థలు ఒక్కొక్కటిగా స్వర్ణోత్సవాల దిశగా అడుగుపెడుతున్నాయి. అందులో భాగంగా దుంపగడపలో 1972లో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం శత జయంతి సందర్భంగా ఆయన పేరున ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధితూ వచ్చింది. కొంతకాలం ప్రయివేటు కళాశాలగా నడిచినప్పటికీ నేడు ప్రభుత్వ కళాశాలగా కొనసాగుతోంది. ఎనిమిది మంది విద్యార్థులతో ప్రారంభించిన కళాశాల నేడు వేలాది మందికి విద్యాదానం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు కళాశాల విద్య అందుబాటులోకి తేవాలన్న మూర్తి రాజు కలల రూపంగా ఈ కళాశాల వెలిసింది. గ్రామస్తులు పిన్నమరాజు సీతారామరాజు, మరికొందరు ప్రముఖుల కృషితో ఏర్పడిన ఈ కళాశాల అనతి కాలంలోనే డిగ్రీ కళాశాలగా ఎదిగింది. అయితే డిగ్రీ కళాశాల ఆనాటి మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి పేరుతో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తోంది. ఆ గ్రామంలో పూర్వపు అగ్రహారీకులుగా పిలవబడే ములుగు రాఘవాచార్యులతో పాటు మరికొందరు గ్రామస్తులు దాతలు ఇచ్చిన విశాలమైన ప్రాంగణంలో ఈ కళాశాలను ప్రారంభించారు. నాటి ప్రముఖులు కలిదిండి అప్పల సూర్యనారాయణరాజు కృషితో ఆయనే తొలి అధ్యక్షులుగా అభివృద్ధి కమిటీ ఏర్పడింది. ఈ కమిటీలో తాడినాడ గ్రామ మాజీ సర్పంచి కళాశాల పూర్వవిద్యార్థి నంబూరి వెంకటరామరాజు కార్యదర్శిగా ప్రధాన పాత్ర పోషించారు. ఆయనతో పాటు సుమారు 25 మంది ప్రముఖులు కమిటీలో సభ్యులుగా చేరారు. సుమారు 18 ఎకరాల స్థలంలో రెండు కళాశాల భవనాలు విడివిడిగా నిర్మించారు. నేడు ఈ కళాశాల మాస్టర్ డిగ్రీ స్థాయికి చేరింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి ఎంఎస్‌సి ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలలో ఎక్కడా లేనివిధంగా ప్రయివేట్ కళాశాలలకు దీటుగా సైన్స్ లేబరేటరీ, కంప్యూటర్ లేబరేటరీ, లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలు ఇక్కడ విద్యార్థులకు ఎంతగానో కలిసి వస్తున్నాయి. వీటితోపాటు కొల్లేటి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం అత్యంత విశేషమైన విషయం. కళాశాలలో విద్యనభ్యసించి బయటకెళ్లిన వారు రాష్ట్రంలోనే అతి గొప్ప వ్యాపారవేత్తలుగా, రాజకీయ నాయకులుగా, పారిశ్రామికవేత్తలుగా స్థిరపడ్డారు. వేల మంది భవిష్యత్తుకు మార్గం సుగమం చేసిన ఈ కళాశాల స్వర్ణోత్సవాలను 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి వెంకటరామరాజు తెలిపారు. ఉదయం ప్రముఖులు, పలు రంగాల్లో నిష్ణాతులు, అతిథులతో సందేశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులు, పూర్వవిద్యార్థులు, 50 సంవత్సరాలుగా కళాశాలలో పనిచేసి రిటైర్ అయిన అధ్యాపకులు, దాతలు, కళాకారులు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

ప్రజాశక్తి - మొగల్తూరు

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగరాజు అన్నారు. అగ్రహారంలో వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గీతారాంబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గొబ్బెమ్మలు, గంగిరెద్దులు హరిదాసులతో భోగి మంటలు, భోగిపళ్లు, బొమ్మల కొలువు, పిండి వంటలు, కోలాటంతో సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బోణం నరసింహారావు, రాయుడు లక్ష్మణరావు, ఎం.సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

ఆచంట: భవ్యభారతీ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆచంట సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కొలిశెట్టి వీర వెంకట తాతారావు మాట్లాడారు. ముఖ్యంగా నారదుడు, హరిదాసు వేషధారణ ఆకట్టుకుంది. స్కూల్ ఆవరణ గొబ్బెమ్మలు, రంగవల్లులు, బొమ్మలకొలువుల సందడి నెలకొంది. అనంతరం విద్యార్థులు డాన్స్‌లతో అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, ఎం.సుబ్రహ్మణ్యం, పి.సీతారామాచార్యులు పాల్గొన్నారు.

వీరవాసరం:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ (దాసు) అన్నారు. కొణితివాడలో శ్రీనివాసరాజు తోటలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి పొందిన వీరవల్లి అనంతలక్ష్మికి రూ.12 వేలు, రెండో బహుమతి పొందిన బుగ్గా విజయలక్ష్మికి రూ.6 వేలు, మూడో బహుమతి పొందిన దాడి భీమేశ్వరి దుర్గకు రూ.మూడు వేలను ముఖ్యఅతిథులు వైసిపి మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ, కోటిపల్లి బాబు చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వీరవాసరం, కొణితివాడ సర్పంచులు చికిలే మంగతాయారు, భీశెట్టి లక్ష్మీ, వీరవాసరం వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ పాల్గొన్నారు.



నరసాపురం : వైఎన్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

పోడూరు : భోగి మంటలు, రంగవల్లులు, చిన్నారుల సాంప్రదాయ వేషధారణలతో గుమ్మలూరులోని మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐ కొండవీటి శ్రీనివాస కుమార్, ఎస్ఐ వై.నాగలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిఐ శ్రీనివాస కుమార్ మాట్లాడారు. ఎస్ఐ నాగలక్ష్మి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భోగిమంటను వెలిగించారు. కార్యక్రమంలో సర్పంచి గొట్టుముక్కల సోనియా రాణి, ఉపాధ్యాయిని పీటర్సన్ శాంతాగ్రేస్ పాల్గొన్నారు.

నరసాపురం : సంక్రాంతి తెలుగు వారందరి పండుగ అని వైన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు అన్నారు. పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు కోలాటం ఆడారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, గరగ నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘు రామారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. యువత సంస్కృతీ, సంప్రదాయాలు పట్ల పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బిఇడి కళాశాల కరస్పాండెంట్ కానూరి స్వామి నాయుడు, జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ అందే రామ్‌సతీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం

ఆచంట :ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తోందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అన్నారు. యుటిఎఫ్ మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం కె.నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో రామభద్రం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయ రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కెవి రామభద్రం పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా ఎం.శీను బాబు, సహాయకులుగా కేతా వెంకటేశ్వరరావు, పరిశీలకులుగా పి.శ్రీనివాస్ వ్యవహరించారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా సిడికె.శర్మ, అధ్యక్షులుగా వి.అరుణ్‌కుమార్, సహాధ్యక్షులుగా పి.మంగ, సిహెచ్.బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.కాశీవిశ్వనాథం, కోశాధికారిగా కె.నరేష్ కుమార్, కార్యదర్శులుగా కె.నాగేశ్వరరావు, డి.పుష్పలత, ఎంపీ.రావు, కె.నరసింహమూర్తి, ఆర్.కమల్‌నాథ్, హసన్ అలీషా, ఎం.వెంకట్రావు, శ్రీనివాస్, కుమార్‌స్వామి రాజా, వైడి శ్రీనివాసరావు, ఆడిట్ కన్వీనర్‌గా వి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

గరగపర్రు రైతు ముద్దుబిడ్డ.. వెంకట రామరాజు



వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట రామరాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పాలకోడేరు



మాట్లాడుతున్న వెంకట రామరాజు

వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు గరగపర్రు రైతు ముద్దుబిడ్డని, దేశంలో ఆయనకు పేరు ప్రఖ్యాతలు ఉన్నప్పటికీ ఒదిగే ఉండడం ఆయన గొప్పతనమని పలువురు వక్తలు కొనియాడారు. గరగపర్రు సచివాలయ ఆవరణలో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, సతీమణి వరలక్ష్మి, ఆయన సోదరుడు ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజును ఘనంగా సన్మానించారు. ముందుగా మెయిన్ రోడ్డు నుంచి ర్యాలీగా సభ ప్రాంగణానికి వాయిద్యాలు, పూల వర్షం మధ్య వారిని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకట్రామరాజు, సతీమణి, సోదరుడు కృష్ణంరాజును సన్మాన కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. రైతు కుటుంబంలో జన్మించి దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు గాంచిన వ్యక్తి వెంకటరామరాజు అన్నారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముదునూరి రామకృష్ణంరాజు, ఎంపిటిసి సభ్యులు షేక్ పాపా సాహెబ్ (శంకరం), పంచాయతీ కార్యదర్శి కె.రాజేష్, విఆర్ఒ నాయుడు, సన్మాన కమిటీ సభ్యులు జి.రామకృష్ణంరాజు, టి.సాల్మన్ రాజు, సిహెచ్.బలరామరాజు, కట్ట శ్రీనివాస్, పి.రమేష్, వెంకటేశ్వరరావు, జి.వెంకన్న, చింతలపాటి సూర్యనారాయణ రాజు, చిన్నబ్బులు, ఎం.వాసు, అల్లూరి పెద్దిరాజు, వత్సవాయి రామరాజు, ఎ. సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాధాకృష్ణ, నూకరాజుపాల్గొన్నారు.

రైతు బిడ్డనని చెప్పుకోవడం గర్వం ఉంటుంది

వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట రామరాజు

దేశంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించానని, ఎక్కడికి వెళ్లిన ఏ వేదిక మీదైనా రైతు బిడ్డనని చెప్పుకోవడం నాకు గర్వంగా ఉంటుందని సన్మాన గ్రహీత వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడే జన్మించిన తనను గ్రామస్తులు సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అయితే ఇటువంటి సత్కారాలకు దూరంగా ఉంటానని చెప్పారు. మంచి లక్ష్యంతో వసుధ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని, ఎన్నో ఏళ్ల నుంచి అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్య తిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో అనేక ఫౌండేషన్ బ్రాంచులు ఉన్నాయని, అనేక మందికి సేవ చేస్తున్నామని తెలిపారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఫౌండేషన్ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని చెప్పారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కం 1వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ : తాడేపల్లిగూడెం
సి.సి.నెం. 1136/2021

బిట్వీన్:
కైగాల రామారావు ...కంప్లయినెంట్
మరియు
ఉల్లింకల వి.యన్.యస్.చిన్నారావు ...ముద్దాయి

పై నెంబరు కేసులో మీపై కంప్లయినెంట్ కోర్టులో చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేసియున్నారు. పై నెంబరు కేసులో నోటీసులు ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లింకల వి.యన్.యస్. చిన్నారావు Avoid చేసియున్నారనియు శ్రీకోర్టు వారు ది.18-01-2023 సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. సదరు **18-01-2023వ తేదీన కోర్టులో ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను.** అట్లు హాజరు కాని ఎడల శ్రీ కోర్టు వారు చట్టప్రకారం మీ పరోక్షముగా తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.సత్యనారాయణ,
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
12-1-23. సెల్: 94401 43195

ఉప్పులూరులో అపూర్వ సమ్మేళనం

హాజరైన ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - ఉండి

ఉప్పులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983 -84 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ నేపథ్యంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ అందించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన టిడిపి ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను) తమ తోటి విద్యార్థులతో గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శుక్రవారం ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణ రాజు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు స్నేహితులందరూ ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెద్ద తాడేపల్లి 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుండి 1.00 వరకూ కుంచనపల్లి, మోదుగుంట, అగ్రహారం సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరావు తెలిపారు. ఈ మేరకు కుంచనపల్లి, అగ్రహారం, కొండ్రుప్రోలు, మెట్టప్పురగూడెం మోదుగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

<u>ప్రకటనార్థం</u>

In The Court Of The Motor Vehicles Accidents Claims Tribunal At Nuzvid
<u>M.V.O.P.No. 19/2015</u>

బిట్వీన్:
యలమర్తి ధనలక్ష్మి మరికొందరు ...పిటీషనర్స్
అండ్
ఇంద్రజిత్ సాహ, తండ్రి: శైలేంద్రనాథ్ సాహ, హిందూ, 45 సం၊7లు, లారీ నెంబరు WB 57 B 2797 ఓనర్, C/o. బిస్మిల్లా లారీ సప్లయ్ ఆఫీసు, మెయిన్ బజార్, నూజివీడు-521201
...2వ రెస్పాండెంటు

పై పేర్కొన్న దావాలోని పై తెలిపిన రెండవ రెస్పాండెంటు యొక్క హాజరు నిమిత్తం పై తెల్పిన శ్రీ కోర్టు వారు **ది.27-01-2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున పై తెల్పిన రెండవ రెస్పాండెంటు పై తెల్పిన తేదీనాడు శ్రీ కోర్టు వారి ముందు హాజరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ అభ్యంతరములను తెలపుకొనవలెను.** లేనిచో రెండవ రెస్పాండెంటు యొక్క పరోక్షములో శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు గాన తెలియ జేయడమైనది.

<u>వాయిదా తేదీ : 27-01-2023</u>

బి.రామకృష్ణ
పిటీషనర్సు తరుపు న్యాయవాది,
నూజివీడు, నూజివీడు.
12-1-23. సెల్: 93927 33847

<u>వేలం ప్రకటన</u>

గౌరవనీయులైన నూజివీడు సీనియర్ సివిల జడ్జి వారి కోర్టులో
<u>ఇ.పి.నెం. 43/2012 ఇన్</u>
<u>ఓ.యస్.నెం. 198/2011</u>

బిట్వీన్:
1) సజ్జా రామమోహనరావు (డైడ్) & 3 Others ...డి. హెచ్. ఆర్స్
మరియు
పొట్లూరి వెంకట గోపాల్ ...జె.డి.ఆర్

పూర్వపు కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ రిజిస్ట్రార్ ఇలాకా, నూజివీడు పట్టనంలోని ఆర్.యస్.నెం. 450/1లో 2640 చ॥గ॥ ఖాళీ ఇండ్ల స్తలంలో ఉన్న 400 చ॥గజాల ఖాళీ నివేశన స్థలం అయివుండి, పైన తెల్పిన జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద పై కోర్టు వారిచే జప్తు కాబడియుండి వేలం కావలసియున్న ఆస్థికి హద్దులు:
తూర్పు: మునిసిపల్ రోడ్డు.
దక్షిణం: జాదం నాగాజి బాబు గారి ఇళ్ల స్తలం.
పడమర: జె.డి.ఆర్.యొక్క మిగతా ఇళ్ల స్థలం. (పొట్లూరి వెంకట గోపాల్ గారి స్థలం)
ఉత్తరం: జె.డి.ఆర్.యొక్క మిగతా ఇళ్ల స్థలం. (పొట్లూరి వెంకట గోపాల్ గారి స్థలం)
జె.డి.ఆర్. విలువ సుమారు రూ.10,00,000/-
అమీనా విలువ రూ.12,00,000/-

మొత్తం 2640 చ॥గజాల స్థలం జప్తు చేయబడినప్పటికీ కేవలం 400 చ॥గజాలకు మాత్రమే షెడ్యూలును ది.03-06-2013న మార్పు చేసి దాఖలు చేయటమైనది. 400 చ॥గజాల స్థలంనకు మాత్రమే కోర్టు వారు నిర్ణయించిన రేటు ప్రాతిపాదికన వేలం జరుగును.

పైన తెల్పిన ఆస్థిని శ్రీకోర్టు వారు **ది. 10-02-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥ల నుండి బహిరంగ వేలం వేయుదురు.** కావున ఆసక్తి కలవారు సదరు వేలంలో పాల్గొని సదరాస్థిని పాడుకొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.శ్రీనివాసరెడ్డి
డి.హెచ్.ఆర్. తరుపు న్యాయవాది,
నూజివీడు.

<u>SUMMON NOTICE</u>
BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR NALGONDA DISTRICT AT NALGONDA.
FILE No. A.A/CF/No. 258 OF 2022

Between:-
M/s. KAPIL CHITS (TELANGANA) PVT. LTD, Suryapet Branch, Represented by its Legal Officer, M.Narsimha Raju, S/o. Pichaiah, Age: 39 years, R/o. Nalgonda Town & Dist.
...Disputant,
AND
1. Donga Venu, S/o. Venkateshwar Rao, Age about 41 years, Occ: Business, R/o. H.No. 2-2-8, Main Road, Poola Center, Suryapet Town & District.
2. Mallula Srinivasu, S/o. Adinarayana, Age about 51 years, Occ: Lineman, R/o. H.No. 12-110, Dongavari Veedhi, Buntumilli Pala Konduru, West Godavari District, A.P.
3. Bandi Venkateshwarlu,S/o.Musalayya, Age about 61 years,Occ:H.L.Handling Labour(FCI), R/o. H.No. 13-13, Pallapu Veedi, Bantum Pala Konduru eduruga, West Godavari Dist,A.P.
4. Bonthu Rama Chandar Rao, S/o. Suryanarayana, Age about 39 years, Occ: Pvt Employee, R/o. H.No. 2-12-2, Satyanarayana Nagar, Pedalanka, Krishna District, A.P.
5. Basani Mahesh, S/o. Somaiah, Age about 32 years, Occ: Business, R/o. H.No. 7-88/1, Komatipalli Village, Jajireddygudem, Kommala Mandal, Suryapet District.

...Opponents.

Where As the above named disputant has made an application for reference of the dispute with regard to non payment of subscription u/s 32 of Chit Fund Act 1982, and Demand for consolidated payment of future subscriptions with interest U/s 33 of Chit Fund Act, 1982, for the chit series TSPT01J Ticket No.31 Which was sanctioned bearing Vide PSC No.109/2017 dated on 16-03-2017 to be examined under the provisions of Section 64 of Chit Funds Act, 1982.

As on the date of filing disputed Claim is Rs. 1,05,466-00 .

You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Nalgonda District Register Office Municipal Complex, Nalgonda town and District, in person duly on Dt. 23-01-2023 At 11-00 A.M., in to show cause why the application should not be complied with that we may cause for to be done.

Please take notice that if no appearance is made on the above mentioned date and time and no counter is filed, the case will be disposed on its merits as ex-parte.

DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NALGONDA DISTRITCT DISTRICT REGISTAR OFFICE MUNCIPAL COMPLEX NALGONDA.